# దక్షిణాపథ వార్తావని

అక్టోబర్ 2026
సంపుటి - 05
సంచిక - 10

సాంప్రదాయకంగా మన దేశంలో వింధ్యకు దక్షిణాన ఉన్న భూమి దక్షిణాపథంగా పరిగణించబడుతుంది. భారతీయ ఏకాత్మత స్ఫూర్తిగా సమాజాన్ని, మారుతున్న కాలాన్ని ప్రతిబింబిస్తూ గొప్ప చరిత్ర, సంస్కృతి, సంప్రదాయాలు, ప్రజలు, స్ఫూర్తిదాయక చిహ్నాలను సంగ్రహించడం, సమీకరించడం దక్షిణాపథం పేరిట నడిపే ఈ బులెటిన్ లక్ష్యం. రాష్ట్రాల పరంగా చూస్తే దక్షిణాపథం ప్రస్తుత ఆంధ్రప్రదేశ్, గోవా, కర్ణాటక, కేరళ, మహారాష్ట్ర, పాండిచ్చేరి, తమిళనాడు, తెలంగాణ రాష్ట్రాలను సూచిస్తుంది. ప్రస్తుతమున్న మధ్యప్రదేశ్, చత్తీస్ గఢ్ మరియు ఒడిషాలోని కొన్ని ప్రాంతాలు కూడా దక్షిణాపథం క్రిందికే వస్తాయి. ఈ ప్రాంతాల విషయాలు ఈ బులెటిన్ లో ప్రస్తావిస్తున్నాము.

## దేవీ శరన్నవరాత్రుల వైభవం (అక్టోబర్ 11 నుండి)

శరదృతువు వెన్నెలలో ప్రకృతి పులకించగా, భక్తి పరిమళాలతో ఆలయాలు, ఇళ్లు, వీధులు శోభిల్లే పవిత్ర సమయం దేవీ శరన్నవరాత్రులు. తొమ్మిది రాత్రులు, పది రోజులపాటు జరిగే ఈ మహోత్సవం కేవలం ఒక పండుగ మాత్రమే కాదు; ఇది శక్తి ఆరాధన, ఆత్మపరిశుద్ధి, ధర్మవిజయం, సాంస్కృతిక వైభవం, కుటుంబ సమైక్యతల సమ్మేళనం. అమ్మవారి వివిధ రూపాలను ఆరాధిస్తూ మనిషి తనలోని అజ్ఞానాన్ని తొలగించుకొని జ్ఞానజ్యోతిని వెలిగించుకోవడమే ఈ నవరాత్రుల అంతరార్థం.

### మొదటి రోజు – శైలపుత్రి:

పర్వతరాజు కుమార్తె అయిన శైలపుత్రిని ఆరాధిస్తూ నవరాత్రులకు శ్రీకారం చుడతారు. స్థిరత్వం, ధైర్యం, సంకల్పానికి ఈ రూపం ప్రతీక. ఆధ్యాత్మికంగా మన జీవితానికి దృఢమైన పునాది వేసుకోవాలని ఈ రోజు బోధిస్తుంది.

### రెండవ రోజు – బ్రహ్మచారిణి:

తపస్సు, నియమం, ఏకాగ్రతకు ప్రతిరూపమైన బ్రహ్మచారిణి అమ్మవారిని పూజిస్తారు. కోరికల వెంట పరుగెత్తే మనసును నియంత్రించి, ఉన్నత లక్ష్యాల వైపు నడిపించుకోవడం ఈ రోజు ఇచ్చే సందేశం.

### మూడవ రోజు – చంద్రఘంట:

చంద్రఘంట రూపంలో అమ్మవారు శాంతి, శౌర్యాల సమన్వయంగా దర్శనమిస్తారు. భయాన్ని జయించి ధర్మాన్ని రక్షించే ధైర్యాన్ని భక్తులకు ప్రసాదిస్తుందని విశ్వాసం. ఆలయాల్లో గంటానాదాలు, మంగళవాయిద్యాలు భక్తి వాతావరణాన్ని మరింత మధురంగా మారుస్తాయి.



### ఐదవ రోజు – స్కందమాత:

మాతృత్వం, కరుణ, రక్షణకు ప్రతిరూపమైన స్కందమాతను పూజిస్తారు. తల్లి ప్రేమలోని నిస్వార్థతను స్మరించుకునే రోజు ఇది. కుటుంబ సభ్యులంతా కలిసి పూజలు చేయడం, ప్రసాదాలను పంచుకోవడం కుటుంబ బంధాలను మరింత బలపరుస్తుంది.

### ఆరవ రోజు – కాత్యాయని:

అధర్మంపై ధర్మం సాధించే విజయశక్తిగా కాత్యాయనీ దేవిని ఆరాధిస్తారు. మనలోని దుర్గుణాలను ఎదుర్కొనే అంతర్గత శక్తిని మేల్కొల్పుకోవాలని ఈ రోజు సూచిస్తుంది.

### ఏడవ రోజు – కాళరాత్రి:

భయంకరమైన రూపంలో కనిపించినప్పటికీ భక్తులకు శుభాన్ని ప్రసాదించే కాళరాత్రి అమ్మవారు అజ్ఞానం, భయం, దుష్టశక్తుల వినాశనానికి ప్రతీక. మనలోని చీకట్లను తొలగించి జ్ఞానదీపాన్ని వెలిగించుకోవడం ఈ రోజు యొక్క పారమార్థిక సందేశం.

### నాలుగవ రోజు – కూష్మాండ:

సృష్టిశక్తికి ప్రతీకగా కూష్మాండ దేవిని ఆరాధిస్తారు. విశ్వమంతటినీ ప్రకాశింపజేసే దైవశక్తి మనలోనూ ఉందనే భావన ఈ రోజుకు ప్రత్యేకత. దీపారాధనలు, నైవేద్యాలు, పూజా కార్యక్రమాలతో ఇళ్లు ఆధ్యాత్మిక కాంతులతో నిండిపోతాయి.

### ఎనిమిదవ రోజు – మహాగౌరి:

పరిశుద్ధత, శాంతి, సౌమ్యతకు ప్రతీకగా మహాగౌరి అమ్మవారిని పూజిస్తారు. మనస్సును మలిన ఆలోచనల నుంచి శుద్ధి చేసుకొని ప్రేమ, దయ, క్షమ వంటి సద్గుణాలను పెంపొందించుకోవాలని ఈ రోజు తెలియజేస్తుంది.

www.dakshinapatha.com www.csisindia.com

# దక్షిణాపథ స్టడీస్ బులెటిన్

ఈ ప్రత్రిక లో దక్షిణాపథ యొక్క ఆర్థిక సామాజిక సాంస్కృతిక రాజకీయ చరిత్ర పై మీ వ్యాసాలు ప్రచురించాలంటే సంప్రదించండి

For publishing your articles on Socio Cultural political and Economic history of Dakshinapatha please contact research@csisindia.com

Contact : +917075881925

### తొమ్మిదవ రోజు – సిద్ధిధాత్రి:

సిద్ధులు - జ్ఞానం, పరిపూర్ణతను ప్రసాదించే సిద్ధిధాత్రీదేవిని ఆరాధిస్తారు. తొమ్మిది రోజుల సాధనకు ఇది పరిపూర్ణతను చేకూర్చే దశ. భక్తి, జ్ఞానం, కర్మ, ధ్యానం - ఈ నాలుగు మార్గాల సమన్వయంతో జీవితం సార్థకమవుతుందనే భావన ఇక్కడ ప్రతిఫలిస్తుంది.

### పదవ రోజు – విజయదశమి:

నవరాత్రుల పరాకాష్ఠ విజయదశమి. ధర్మం అధర్మంపై, సత్యం అసత్యంపై, వెలుగు చీకటిపై సాధించిన విజయానికి ఇది ప్రతీక. ఆయుధపూజ, విద్యారంభం, శమీపూజ, బొమ్మల కొలువులు, సాంస్కృతిక కార్యక్రమాలు ఈ రోజును లౌకికంగానూ విశిష్టంగా నిలబెడతాయి.

శరన్నవరాత్రులు మనకు ఒక గొప్ప సత్యాన్ని గుర్తుచేస్తాయి - దేవి కేవలం బయటకి ఆరాధించే శక్తి మాత్రమే కాదు; ప్రతి మనిషిలోనూ ఉన్న చైతన్యశక్తి కూడా. తొమ్మిది రోజుల పూజలో మనం అమ్మవారి తొమ్మిది రూపాలను దర్శించినట్లే, మనలోని ధైర్యం, నియమం, శాంతి, సృజనాత్మకత, మాతృత్వం, శౌర్యం, నిర్భయత్వం, పవిత్రత, జ్ఞానం అనే తొమ్మిది అంతరశక్తులను మేల్కొలపాలి.

అందుకే శరన్నవరాత్రులు కేవలం దీపాలు వెలిగించే పండుగ కాదు; మన హృదయంలోని అజ్ఞానాంధకారాన్ని తొలగించి, జ్ఞానజ్యోతిని వెలిగించే మహాసాధన. అమ్మవారి కృపతో ప్రతి ఇంటా సుఖశాంతులు, ప్రతి హృదయంలో ధైర్యం, ప్రతి జీవితంలో ధర్మం, ప్రతి సమాజంలో సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని కోరుకుంటూ - "జయ జయ హే మహిషాసురమర్దిని! జయ జయ జగదంబికే!"

## చిరస్మరణీయ స్వరాజ్య సమరయోధుడు
## శ్యాంజీ కృష్ణవర్మ (జన్మతిథి, అక్టోబర్ 4)

భారతదేశ స్వాతంత్ర్య సంగ్రామంలో ఎందరో మహానుభావులు తమ జీవితాలను, ఆస్తులను త్యాగం చేశారు. అలాంటి వారిలో ప్రముఖులు శ్యామ్‌జీ కృష్ణవర్మ. ఆయన అక్టోబర్ 4, 1857న జన్మించారు. మార్చి 30, 1930న మరణించారు. 2003లో అప్పటి గుజరాత్ ముఖ్యమంత్రి నరేంద్ర మోదీ స్విట్జర్లాండ్‌లోని జెనీవా నుంచి ఆయన అస్తికలను సగౌరవంగా మనదేశానికి తీసుకువచ్చారు.

శ్యామ్‌జీ కృష్ణవర్మ గుజరాత్‌లోని కచ్ జిల్లా మాండ్విలో ఒక సంపన్న కుటుంబంలో జన్మించారు. స్వదేశంలోనే విద్యాభ్యాసం చేశారు. సంస్కృత భాషలో అపారమైన పాండిత్యాన్ని సంపాదించారు. ఆ రోజుల్లో బ్రాహ్మణేతర పండితులలో ఏకైక ప్రతిభావంతునిగా నిలిచారు. ఫిలాసఫీ, సోషియాలజీతోపాటు న్యాయశాస్త్రం కూడా చదువుకున్నారు.

భార్య భానుమతి - ఆయన ఆశయాలకు, ఆలోచనలకు అనుగుణంగా నడుచుకుంటూ అన్ని విధాలా సహకరించేవారు. స్వామి దయానంద సరస్వతి స్థాపించిన ఆర్యసమాజ్ బొంబాయి విభాగానికి అధ్యక్షుడిగా కొంతకాలం ఆయన సేవలు అందించారు. దయానంద సరస్వతి ప్రభావం ఆయనపై చాలా ఎక్కువగా ఉండేది. అనంతరం అనేక స్వదేశీ సంస్థానాలలో దివాన్‌గా పనిచేశారు. పేరు ప్రఖ్యాతులు సంపాదించారు. ఆ తర్వాత లండన్‌లో బారిస్టర్‌గా ప్రాక్టీస్ చేయాలనే ఉద్దేశంతో ఇంగ్లండ్ వెళ్లారు.

లండన్‌లో భారతీయ విద్యార్థుల కోసం 'ఇండియా హౌస్' అనే ఒక ఆశ్రమాన్ని స్థాపించారు. విదేశాలకు వచ్చే విప్లవకారులకు, స్వాతంత్ర్య సమరయోధులకు వసతి, భోజన సదుపాయాలతోపాటు అన్ని రకాల సహాయ సహకారాలను శ్యామ్‌జీ కృష్ణవర్మ అందించారు. ఈ విధంగా వచ్చినవారిలో ముఖ్యుడు వీరసావర్కర్. ఆయనకు లండన్‌లో చదువుకోవడానికి ఉపకారవేతనాన్ని స్వయంగా ఏర్పాటు చేశారు. అంతకుమునుపు సావర్కర్ ప్రతిభను మెచ్చి, ఆయనకు లండన్‌లో ఆశ్రయం కల్పించవలసిందిగా బాలగంగాధర్ తిలక్ శ్యామ్‌జీకి లేఖ రాశారు.



ఈ విధంగా ఆయన తన సంపదనంతా స్వాతంత్ర్య సమరయోధులు, విప్లవకారులకు, ఇండియా హోమ్‌రూల్ సొసైటీ స్థాపనకు ఖర్చు చేశారు.

స్వదేశంలో రాజకీయ, సామాజిక, ధార్మిక చైతన్యాన్ని పెంపొందించడం, ప్రజలను చైతన్యపరచడం కోసం లండన్‌లో 'ది ఇండియన్ సోషియాలజిస్ట్' అనే పత్రికను స్థాపించారు. విప్లవకారులను తయారుచేస్తున్నారని, దేశ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే నెపంతో బ్రిటిష్ ప్రభుత్వం ఆయనపై నిఘా పెట్టింది.

బ్రిటీషు ప్రభుత్వం తనను అరెస్టు చేస్తుందని ముందుగానే గ్రహించి, 1907లో పారిస్ (ఫ్రాన్స్)కు, 1910లో స్విట్జర్లాండ్‌లోని జెనీవాకు తన కార్యస్థానాన్ని మార్చుకున్నారు, శ్యాంజీ. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో స్విట్జర్లాండ్ తటస్థ విధానాన్ని అనుసరించడం వల్ల అక్కడి నుంచే ఉద్యమాన్ని నడిపారు.

ఆయన, మార్చి 30, 1930న పరమపదించారు. ఆయన చివరి కోరిక మేరకు స్విస్ ప్రభుత్వం ఆయన చితాభస్మాన్ని భద్రపరిచింది. 1947లో దేశానికి స్వాతంత్ర్యం వచ్చినప్పటికీ, దాదాపు 56 సంవత్సరాలపాటు ఏ భారత ప్రభుత్వమూ ఈ విషయాన్ని పట్టించుకోలేదు.

చివరకు 2003లో నాటి ప్రధాని అటల్ బిహారీ వాజపేయి హయాంలో, అప్పటి గుజరాత్ సీఎం నరేంద్ర మోదీ జెనీవా వెళ్లారు. శ్యామ్‌జీ కృష్ణవర్మ, ఆయన భార్య భానుమతి అస్తికలను తన తలపై పెట్టుకుని స్వదేశానికి తీసుకువచ్చారు. మాండ్విలో, లండన్‌లోని ఇండియా హౌస్‌ను పోలిన స్మారక స్తూపాన్ని నిర్మించారు. అక్కడ వారి చితాభస్మాన్ని ఉంచారు.

అలాగే బ్రిటన్‌లోని ఇన్నర్ టెంపుల్ లా అసోసియేషన్ కూడా నరేంద్ర మోదీ పిటిషన్ మేరకు 2015లో శ్యామ్‌జీ కృష్ణవర్మ సభ్యత్వాన్ని గౌరవప్రదంగా పునరుద్ధరించింది. దేశ స్వరాజ్య సిద్ధికి సర్వస్వం ధారపోసిన మహనీయుల త్యాగాలను స్మరించుకోవడం మనందరి బాధ్యత.

**-జాగృతి వారపత్రిక సౌజన్యంతో**

## హోమీ జహంగీర్ భాభా (జన్మతిథి, అక్టోబర్ 30)

హోమీ జెహంగీర్ భాభా - భారత అణు విజ్ఞాన స్వప్నశిల్పి. ఆయన జీవితం కేవలం ఒక శాస్త్రవేత్త జీవితకథ కాదు; "భారతదేశం కూడా ప్రపంచ శాస్త్రరంగంలో అగ్రగామిగా నిలవాలి" అనే మహాసంకల్పానికి ప్రతిరూపం. విజ్ఞానాన్ని దేశ నిర్మాణానికి ఒక శక్తివంతమైన సాధనంగా మలచిన దూరదృష్టి గల మహనీయుడు భాభా.

1909 అక్టోబర్ 30న ముంబైలో జన్మించిన హోమీ జెహంగీర్ భాభా చిన్ననాటి నుంచే అసాధారణ మేధాశక్తిని ప్రదర్శించారు. గణితం, భౌతికశాస్త్రాల పట్ల ఆయనకు అపారమైన ఆసక్తి ఉండేది. ఉన్నత విద్య కోసం ఇంగ్లాండ్‌లోని కేంబ్రిడ్జ్ విశ్వవిద్యాలయానికి వెళ్లి భౌతికశాస్త్రంలో విశేష ప్రతిభను కనబరిచారు. ప్రపంచంలోని ప్రముఖ శాస్త్రవేత్తలతో కలిసి పనిచేస్తూ ఆధునిక భౌతికశాస్త్రంలో తనకంటూ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్నారు.



అయితే భాభా ప్రతిభకు అసలైన పరీక్ష భారతదేశానికి తిరిగి వచ్చిన తర్వాతే ఎదురైంది. రెండో ప్రపంచ యుద్ధం కారణంగా విదేశాల్లో కొనసాగుతున్న తన శాస్త్రీయ ప్రయాణాన్ని తాత్కాలికంగా నిలిపి భారతదేశానికి వచ్చిన ఆయన, దేశంలో శాస్త్రీయ పరిశోధనలకు అవసరమైన మౌలిక వసతులు ఎంత కొరవడిపోయాయో గుర్తించారు. అదే సమయంలో ఆయన మనసులో ఒక మహాసంకల్పం రూపుదిద్దుకుంది - భారతదేశం ఇతర దేశాలపై ఆధారపడకుండా తన సొంత శాస్త్రీయ శక్తిని నిర్మించుకోవాలి.

ఈ సంకల్పానికి ఫలితమే టాటా ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ (TIFR). 1945లో స్థాపించబడిన ఈ సంస్థ భారతదేశంలో ప్రాథమిక శాస్త్రీయ పరిశోధనలకు గొప్ప కేంద్రంగా ఎదిగింది. యువ శాస్త్రవేత్తలకు అవకాశాలు కల్పిస్తూ, ప్రపంచస్థాయి పరిశోధనలకు భారతదేశాన్ని వేదికగా మార్చడంలో భాభా కీలక పాత్ర పోషించారు.

భారతదేశ భవిష్యత్తుకు అణుశక్తి ఎంత ముఖ్యమో భాభా చాలా ముందుగానే గ్రహించారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూతో కలిసి భారత అణు కార్యక్రమానికి పునాదులు వేశారు. 1948లో అణుశక్తి కమిషన్ ఏర్పాటులో ఆయన కీలక పాత్ర పోషించారు. తరువాత ట్రాంబేలో అణు పరిశోధనా కేంద్రాన్ని అభివృద్ధి చేశారు. అదే కేంద్రం తరువాత ఆయన గౌరవార్థం **భాభా అణు పరిశోధనా కేంద్రం (BARC)" గా ప్రసిద్ధి చెందింది.

భాభా దృష్టిలో అణుశక్తి అంటే కేవలం సైనిక శక్తి కాదు. విద్యుత్ ఉత్పత్తి, వ్యవసాయం, వైద్యం, పరిశ్రమ వంటి అనేక రంగాల్లో అణుశక్తిని శాంతియుత ప్రయోజనాలకు వినియోగించాలని ఆయన కలలు కన్నారు. దేశ అభివృద్ధి కోసం శాస్త్రసాంకేతికతను ఉపయోగించాలన్న ఆయన ఆలోచన భారత అణు విధానానికి బలమైన పునాదిగా నిలిచింది.

భాభా గొప్పతనం ఆయన శాస్త్రీయ ప్రతిభలోనే కాదు; భవిష్యత్తును ముందుగానే చూడగల దూరదృష్టిలో ఉంది. భారతదేశం పేదరికం, నిరక్షరాస్యత, సాంకేతిక వెనుకబాటుతనం వంటి సమస్యలను అధిగమించాలంటే శాస్త్రవిజ్ఞానం దేశ అభివృద్ధికి కేంద్రబిందువుగా ఉండాలని ఆయన నమ్మారు. అందుకే పరిశోధనా సంస్థలను నిర్మించడమే కాకుండా, ప్రతిభావంతులైన యువతను శాస్త్రరంగంలోకి తీసుకురావడానికి కృషి చేశారు.

1966 జనవరి 24న విమాన ప్రమాదంలో భాభా అకాల మరణం భారతదేశానికి తీరని లోటుగా మారింది. అప్పటికి ఆయన వయసు కేవలం 56 సంవత్సరాలు. కానీ ఆయన నిర్మించిన శాస్త్రీయ సంస్థలు, ఆయన పెంచిన శాస్త్రీయ సంస్కృతి, ఆయన చూపిన దూరదృష్టి మాత్రం భారతదేశంలో చిరస్థాయిగా నిలిచిపోయాయి.

హోమీ జె. భాభా జీవితం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది - దేశ భవిష్యత్తును మార్చేది కేవలం సంపద కాదు; జ్ఞానం, పరిశోధన, పట్టుదల, దూరదృష్టి. ఒక వ్యక్తి తన మేధస్సును దేశ ప్రయోజనానికి అంకితం చేస్తే, తరతరాల భవిష్యత్తును ప్రభావితం చేయగలడని భాభా నిరూపించారు. భారత శాస్త్రీయ ప్రగతి చరిత్రలో ఆయన పేరు ఒక అధ్యాయం కాదు - ఒక యుగానికి ఆరంభం.

## అవనాక్షమ్మ ఆలయం, నారాయణవనం, తిరుపతి

జగన్మాత అయిన అమ్మవారు లోకకల్యాణం కోసం అనేక ప్రాంతాల్లో వెలసి, అనేక పేర్లతో, వివిధ రూపాలతో పూజలందుకుంటోంది. అమ్మవారు శక్తి స్వరూపిణిగా వెలసిన ఒక్కో క్షేత్రం ఒక్కో ప్రత్యేకతను సంతరించుకుని కనిపిస్తుంది. సాధారణంగా అమ్మవారి క్షేత్రాలను దర్శిస్తే అష్టైశ్వర్యాలతో పాటు సంతాన సౌభాగ్యాలు కలుగుతాయని అంటారు.

చిత్తూరు జిల్లా తిరుపతి నుంచి 40 కి.మీ దూరంలో తిరుపతి-చెన్నై రహదారిలో ఉన్న 'నారాయణ వనం' సమీపంలో అవనాక్షమ్మ అమ్మవారు వెలసిన మహిమాన్విత క్షేత్రం విరాజిల్లుతోంది.

అత్యంత మహిమాన్వితురాలుగా భాసించే ఈ అమ్మవారిని, పద్మావతీదేవి తండ్రి ఆకాశరాజు ఇలవేల్పుగా చెబుతారు. ఈ తల్లి దర్శనంతో అవివాహితులకు వివాహ యోగం కలుగుతుందని భక్తుల విశ్వాసం.



అవనాక్షమ్మ దేవాలయంలో అమ్మవారు స్వయంభువుగా వెలసినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా తెలుస్తోంది. సుమారు 3000 సంవత్సరాల ప్రాచీనమైన ఈ ఆలయానికి మనోహరమైన చరిత్ర ఉంది. పురాణాల ప్రకారం సోమకుడు అనే రాక్షసుడు బ్రహ్మ నుంచి వేదాలను అపహరిస్తాడు. పార్వతీదేవి ఆదిపరాశక్తిగా సోమకుని సంహరించి వేదాలను తిరిగి బ్రహ్మకు అప్పజెప్పుతుంది. ఆ సమయంలో పార్వతి నారాయణవనంలో స్వయంభువుగా వెలసిందంట! అప్పుడు బ్రహ్మ ఇక్కడ అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించి పూజించాడు.

అవనాక్షమ్మ స్వయంభువుగా వెలసిన ప్రదేశం అరుణి నదికి దగ్గరగా ఉంది. ఒకసారి అగస్త్యముని ఈ తల్లిని దర్శించి ఆమెకు "ఆమ్నాయాక్షి" అని పేరు పెట్టాడు, అంటే "వేదాలు కళ్ళుగా ఉన్న దేవత" అని అర్థం. ఈ తల్లిని "అవనాసిని దేవి" అని కూడా పిలుస్తారు. తరువాత అది "అవనాక్షమ్మ" గా మారింది. పార్వతీ దేవి ఇక్కడ వేదాలను అసురుల నుంచి రక్షించింది కాబట్టి ఆమెను అమ్నాక్షమ్మ అని కూడా పిలుస్తారు.

తిరుమల శ్రీవారి పట్టపురాణి పద్మావతి దేవి ఆకాశరాజు కుమార్తె. పద్మావతి దేవి తమ ఇంటి ఇలవేల్పు అయిన అవనాక్షమ్మ అమ్మవారిని బాల్యం నుంచి పూజిస్తూ ఉండేది. ఒకానొక సమయంలో పద్మావతి దేవి శ్రీనివాసుని చూసి అతన్నే భర్తగా పొందాలని కోరుకుంటుంది. ఇందుకోసం ఆమె అవనాక్షమ్మ అమ్మవారిని భక్తి శ్రద్ధలతో పూజించి శ్రీనివాసుని భర్తగా పొందినట్లుగా ఆలయ స్థల పురాణం ద్వారా మనకు తెలుస్తోంది. వివాహానికి ముందు పద్మావతీదేవి ఇక్కడే గౌరీ పూజ చేసినట్లుగా చెబుతారు.

సాక్షాత్తు పద్మావతీదేవి ఈ అమ్మవారిని ప్రార్థించి కోరుకున్న శ్రీనివాసుని భర్తగా పొందింది కనుక, ఈ అమ్మవారిని ఆరాధించడం వల్ల వివాహ యోగం కలుగుతుందని విశ్వసిస్తుంటారు. అందుకు నిదర్శనంగా అవనాక్షమ్మ అనుగ్రహంతో వివాహం చేసుకున్న కొత్త దంపతులు అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకోవడానికి ఈ ఆలయానికి ఎక్కువగా వస్తుంటారు.

తిరుమల, తిరుపతి నుంచి నారాయణవనానికి టీటీడీ వారు నిరంతరం బస్సులు నడుపుతుంటారు. నారాయణవనం నుంచి ఒక కి.మీ. దూరంలో ఉన్న అవనాక్షమ్మ ఆలయానికి సులభంగా చేరుకోవచ్చు.

## పుదుచ్చేరి విముక్తి పోరాటం – జాతీయ చైతన్యానికి ప్రతీక (అక్టోబర్ 18)

భారతదేశ చరిత్ర అనేది కేవలం రాజుల, యుద్ధాల, సామ్రాజ్యాల చరిత్ర కాదు. ఈ నేలపై వేల సంవత్సరాలుగా ప్రవహిస్తున్న సంస్కృతి, ధర్మం, ఆత్మగౌరవం, స్వాతంత్ర్య స్ఫూర్తి కలిసిన మహా గాథ. విదేశీ పాలనకు వ్యతిరేకంగా భారతీయులు సాగించిన పోరాటం కూడా ఒకే ప్రాంతానికో, ఒకే వర్గానికో పరిమితం కాలేదు. దేశంలోని ప్రతి ప్రాంతంలో స్వేచ్ఛ కోసం ఒక జ్వాల వెలిగింది. ఆ జ్వాలల్లో పుదుచ్చేరి విముక్తి పోరాటం కూడా ఒక ముఖ్యమైన అధ్యాయం.

ఫ్రెంచ్ పాలనలో ఉన్న పుదుచ్చేరి భారతదేశానికి భౌగోళికంగా చిన్న ప్రాంతమే అయినప్పటికీ, దాని విముక్తి వెనుక ఉన్న జాతీయ ఆకాంక్ష మాత్రం ఎంతో విశాలమైనది. భారతదేశం 1947లో స్వాతంత్ర్యం పొందిన తరువాత కూడా పుదుచ్చేరి సహా కొన్ని ప్రాంతాలు విదేశీ పాలనలోనే కొనసాగాయి. ఇది సంపూర్ణ స్వాతంత్ర్యాన్ని కోరుకున్న భారతీయుల మనసుల్లో అసంతృప్తిని కలిగించింది. "భారతమాత ఒకటే; ఆమె భూభాగం కూడా అవిభాజ్యమైనదే" అనే జాతీయ భావన పుదుచ్చేరి ప్రజల్లో బలపడింది.




భారతీయ సంస్కృతిలో దేశం అనేది కేవలం భూమి కాదు. తల్లి వంటి పవిత్రమైన భావన. హిమాలయాల నుంచి కన్యాకుమారి వరకు, గంగ నుంచి సముద్రతీరం వరకు విస్తరించిన ఈ భూమిని భారతమాతగా దర్శించే సంప్రదాయం మనకు ఉంది. అందుకే విదేశీ పాలనలో మిగిలిన ఏ ప్రాంతమైనా భారతీయుల హృదయాల్లో అసంపూర్ణతకు ప్రతీకగా కనిపించింది. పుదుచ్చేరి విముక్తి ఉద్యమంలోనూ ఈ సాంస్కృతిక జాతీయత స్పష్టంగా ప్రతిఫలించింది.

స్థానిక ప్రజలు, జాతీయవాద నాయకులు, స్వాతంత్ర్య సమరయోధులు పుదుచ్చేరిని భారతదేశంలో విలీనం చేయాలని ఉద్యమించారు. సభలు, నిరసనలు, సత్యాగ్రహాలు, ప్రజా ఉద్యమాల ద్వారా తమ ఆకాంక్షను వ్యక్తం చేశారు. ఈ పోరాటంలో రాజకీయ స్వేచ్ఛతో పాటు స్వాభిమాన భావన కూడా ప్రధాన పాత్ర పోషించింది. తమ భూమిపై తమ ప్రజలే తమ భవిష్యత్తును నిర్ణయించుకోవాలనే ప్రజాస్వామ్య ఆకాంక్ష ఉద్యమానికి బలాన్నిచ్చింది.

చివరకు ప్రజా ఉద్యమాల ఒత్తిడి, రాజకీయ చర్చలు, భారత ప్రభుత్వ దౌత్యపరమైన ప్రయత్నాల ఫలితంగా పుదుచ్చేరి భారతదేశంతో తన సంబంధాన్ని బలపరుచుకుంది. 1954 నవంబర్ 1న ఫ్రెంచ్ పాలనకు వాస్తవ ముగింపు పలికి పుదుచ్చేరి, కారైకాల్, మాహే, యానాం ప్రాంతాలు భారత పరిపాలనలోకి వచ్చాయి. అనంతరం చట్టపరమైన ప్రక్రియలు పూర్తయ్యి 1962లో ఈ విలీనం అధికారికంగా స్థిరపడింది.

పుదుచ్చేరి విముక్తి మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. భారతదేశ జాతీయ ఏకత్వం కేవలం రాజకీయ సరిహద్దులతో ఏర్పడింది కాదు; సంస్కృతి, చరిత్ర, ఆత్మీయ అనుబంధం, ప్రజల సంకల్పం దానిని నిర్మించాయి. భారతీయ జాతీయవాద దృష్టిలో ప్రతి ప్రాంతం భారతమాత శరీరంలోని ఒక అవయవం వంటిది. ఒక ప్రాంతం విదేశీ పాలనలో ఉండటం అంటే ఆ జాతీయ ఏకత్వం ఇంకా సంపూర్ణం కాలేదనే భావన ఉద్యమకారులకు ప్రేరణగా నిలిచింది.

పుదుచ్చేరి విముక్తి పోరాటం కేవలం ఒక చిన్న భూభాగం రాజకీయ విలీన గాథ కాదు. అది భారతీయుల స్వాభిమానానికి, జాతీయ సమైక్యతకు, తమ మాతృభూమిపై ఉన్న ఆత్మీయ బంధానికి ప్రతీక. స్వాతంత్ర్యం కోసం ఎన్నో తరాలు చేసిన త్యాగాలను స్మరించుకుంటూ, దేశం పట్ల బాధ్యతను గుర్తుచేసే చారిత్రక ఘట్టం. పుదుచ్చేరి నేలలో ప్రతిధ్వనించిన ఆ స్వేచ్ఛా నినాదం భారతదేశం ఒకటే, దాని ఆత్మ ఒకటే అనే శాశ్వత భావనకు ప్రతిధ్వనిగా నిలిచింది.

## కిట్టూరు రాణి చెన్నమ్మ - తొలి స్వాతంత్ర్య జ్వాల (అక్టోబర్ 21)

భారత స్వాతంత్ర్య సంగ్రామ చరిత్రలో కొందరు వీరుల పేర్లు కాలగర్భంలో కలిసిపోయినా, వారి త్యాగాల ప్రతిధ్వని తరతరాల భారతీయుల హృదయాల్లో మారుమోగుతూనే ఉంటుంది. అలాంటి అమర వీరనారి కిట్టూరు రాణి చెన్నమ్మ. బ్రిటిష్ ఈస్ట్ ఇండియా కంపెనీ ఆధిపత్యానికి తలవంచకుండా, తన రాజ్య హక్కుల కోసం, స్వాభిమానం కోసం, స్వదేశ గౌరవం కోసం ఆమె సాగించిన పోరాటం భారతీయ ప్రతిఘటన చరిత్రలో ఒక ఉజ్వల అధ్యాయం.

కర్ణాటకలోని కిట్టూరు సంస్థానానికి రాణిగా ఉన్న చెన్నమ్మ ధైర్యసాహసాలకు ప్రతిరూపం. ఆమె భర్త రాజా మల్లసర్జ మరణించిన తరువాత, వారసత్వ సమస్య తలెత్తింది. చెన్నమ్మ తన దత్తపుత్రుడైన శివలింగప్పను వారసుడిగా ప్రకటించింది. అయితే బ్రిటిష్ అధికారులు కిట్టూరు సంస్థానంపై తమ ఆధిపత్యాన్ని విస్తరించాలనే ఉద్దేశంతో ఈ వారసత్వాన్ని అంగీకరించలేదు. సంస్థాన వ్యవహారాల్లో జోక్యం చేసుకుని కిట్టూరును తమ ఆధీనంలోకి తీసుకోవాలని ప్రయత్నించారు.

అది కేవలం ఒక రాజ్యాన్ని స్వాధీనం చేసుకునే ప్రయత్నం మాత్రమే కాదు; భారతీయుల స్వయం నిర్ణయ హక్కుపై జరిగిన దాడిగా చెన్నమ్మ భావించింది. ఆమె బ్రిటిష్ అధికారులకు స్పష్టమైన సందేశం ఇచ్చింది - కిట్టూరు నేలపై విదేశీ ఆధిపత్యాన్ని అంగీకరించేది లేదని.

1824లో బ్రిటిష్ సైన్యం కిట్టూరుపై దండెత్తినప్పుడు, రాణి చెన్నమ్మ వెనుకడుగు వేయలేదు. తన సైన్యాన్ని సమీకరించి ధైర్యంగా ప్రతిఘటించింది. కిట్టూరు కోట గోడలు ఆమె సాహసానికి సాక్ష్యాలయ్యాయి. పరిమితమైన వనరులు ఉన్నప్పటికీ, ఆమె సైనికులు అపారమైన ధైర్యంతో బ్రిటిష్ దళాలను ఎదుర్కొన్నారు. ఈ పోరాటం భారతీయులలో విదేశీ పాలనకు వ్యతిరేకంగా ఉన్న అసంతృప్తికి ఒక శక్తివంతమైన రూపాన్ని ఇచ్చింది.







రాణి చెన్నమ్మ పోరాటంలో అత్యంత గొప్ప విషయం ఆమె స్వాభిమానం. అధికారాన్ని కాపాడుకోవడం మాత్రమే ఆమె లక్ష్యం కాదు; తన నేలపై తన ప్రజల హక్కును కాపాడుకోవడమే ఆమె ధ్యేయం. శత్రువు బలం ఎంత గొప్పదైనా, అన్యాయానికి ఎదురు నిలిచే సంకల్పం అంతకంటే గొప్పదని ఆమె తన జీవితంతో నిరూపించింది.

చివరకు బ్రిటిష్ సైనిక శక్తి ముందు కిట్టూరు ఓడిపోయింది. రాణి చెన్నమ్మను బంధించి బైలహొంగల కోటలో నిర్బంధించారు. 1829లో ఆమె అక్కడే కన్నుమూసింది. కానీ ఒక వీరనారిని కారాగార గోడలు బంధించగలిగాయి గానీ, ఆమె ఆత్మగౌరవాన్ని మాత్రం బంధించలేకపోయాయి.

కిట్టూరు రాణి చెన్నమ్మ పోరాటం మనకు ఒక గొప్ప సందేశాన్ని అందిస్తుంది. స్వేచ్ఛ అనేది ఎవరో ఇచ్చే వరం కాదు; దాని కోసం ధైర్యంగా నిలబడాలి. అన్యాయం ఎదుట మౌనం వహించడం కంటే, న్యాయం కోసం పోరాడటం గొప్పది. ఒక మహిళ కూడా తన సంకల్పంతో బలమైన ఒక విదేశీ శక్తికి సవాలు విసరగలదని చెన్నమ్మ చరిత్ర చాటి చెప్పింది.

ఆమె ఖడ్గం ఒక యుద్ధాయుధం మాత్రమే కాదు - అది భారతీయ స్వాభిమానానికి ప్రతీక. ఆమె పోరాటం ఒక ప్రాంతపు కథ మాత్రమే కాదు; భారతదేశంలో స్వాతంత్ర్య భావనకు ముందుగానే జ్వాల రగిలించిన వీరగాథ.

కిట్టూరు రాణి చెన్నమ్మ మనకు స్ఫూర్తి. ఆమె ధైర్యం మనకు ఆదర్శం. ఆమె త్యాగం మన జాతీయ చైతన్యానికి చిరస్థాయి జ్యోతి.

ఆమెను స్మరించుకోవడం అంటే కేవలం గతాన్ని గుర్తుచేసుకోవడం కాదు - అన్యాయాన్ని ఎదుర్కొనే ధైర్యాన్ని, స్వాభిమానాన్ని, దేశభక్తిని మనలో మేల్కొల్పుకోవడం.

## ‘పద్మశ్రీ’ తిరుత్తణి స్వామినాథన్: తరతరాల ‘ఓదువార్’ సంప్రదాయం

తమిళనాడుకు చెందిన ‘ఓదువార్’ తిరుత్తణి స్వామినాథన్ గారికి తేవారం, తమిళ శైవ సంగీత సాంప్రదాయాలు, పణ్ ఇసై, ప్రాచీన తిరుమురయి కీర్తనల పరిరక్షణకు 6 దశాబ్దాలుగా అంకితమై చేసిన సేవలకుగాను 2026 లో కళారంగంలో ‘పద్మశ్రీ’ పురస్కారం లభించింది. ఆయన 60 సంవత్సరాలకు పైగా పవిత్రమైన ‘తేవారం’, ‘తిరువాచకం’ కీర్తనలను గానం చేస్తూ, పరిరక్షించారు.

(‘తేవారం’ అనేది తమిళనాడులో 7-8 శతాబ్దాల మధ్య శివభక్తులైన ముగ్గురు ప్రముఖ నాయనార్లు (సంబంధర్, అప్పర్, సుందరర్) పరమశివుని కీర్తిస్తూ తమిళ భాషలో రచించిన పవిత్ర భక్తిగీతాల సమాహారం. ఇది తమిళ శైవ గ్రంథమైన ‘తిరుమురయి’ లో మొదటి ఏడు భాగాలను సూచిస్తుంది.

మాణిక్యవాచకర్ లేక మాణిక్యవాసగర్, శివుణ్ణి కీర్తిస్తూ ‘తిరువాచకం’ గ్రంథం రాసిన 9 వ శతాబ్దానికి చెందిన తమిళ భక్తకవి. తమిళంలోని శైవసిద్ధాంతానికి కీలకమైన ‘తిరుమురయి’ గ్రంథంలో మాణిక్యవాచకర్ రచనలు ఒక భాగం.)

స్వామినాథన్ తిరుత్తణి మురుగన్ ఆలయంలో పూర్తికాలపు ఓదువార్ సేవచేశారు. ఆయన ‘తేవారం’ సాంప్రదాయ పాఠశాలల్లో బోధన కూడా చేశారు. ప్రపంచవ్యాప్తంగా ఆలయ గానకళాకారులుగా సేవ చేసిన, చేస్తున్న తరతరాల విద్యార్థులకు ఆయన శిక్షణనిచ్చారు.

### శివాలయాలలో ఓదువార్ల పాత్ర

శైవ ఆరాధనలలో పాడే ‘తిరుమురాయి’ భాగాన్ని ఓదువార్లు నిర్వహిస్తారు. ప్రధాన శివాలయం ముందు జరిగే ప్రతీ పూజాసమయంలో వారు వైదికమంత్ర పఠనంతో పాటు, తేవారం, తిరువాచకం పాడతారు. చివరి హారతికి ముందు లేదా ఆ సమయంలో కీర్తనల గానాన్ని అర్పిస్తారు. పూజారుల వేదపఠనాన్ని సంపూర్ణం చేసే గణ ఉపాసనగా దీని నిర్వహిస్తారు. పెద్ద దేవాలయాలలో ఎక్కువమంది ఓదువార్లు కార్యక్రమావళి పంచుకుంటారు. కాబట్టి తెల్లవారుజాము నుండి రాత్రి వరకు సేవల్లో ఎప్పుడూ ఒక కీర్తన గాయకుడు విధిగా ఉంటారు.

### సారంగపాణి జీవితంలో మలుపు

సారంగపాణి జీవితాన్ని 1954 సం లో ఒక రాత్రి మలుపు తిప్పింది. అతి ప్రఖ్యాతుడైన మదురై సోము పాపనాశనం ఆలయానికి వచ్చి రాత్రంతా గుడిలో గానం చేశాడు. కార్యక్రమం తెల్లవారుజామున 3 గంటలు దాటి సాగింది. నాగరత్నం తన కుమారుని ఆయన వద్దకు తీసుకువెళ్ళి బాలుడి గాఢ భక్తిని గురించి వివరించాడు. సోము పాడమని కోరగా, సారంగపాణి తన కిష్టమైన ‘సింథనై సే మనమే’ ను పాడాడు. సోము వెంటనే అతడి స్వరంలోని నాణ్యత, అంతర్గత ఉత్సాహాన్ని గుర్తించాడు. అతడిని స్వరానికి సంబంధించిన కార్యాచరణలో పెట్టమని తండ్రికి చెప్పాడు.



ఈ సాధారణ సూచన ఆ యువకుడి జీవితాన్ని మార్చింది. అతడు తిరుకడవూరు పాఠశాలలో చేరాడు. అక్కడ ఐదేళ్లపాటు తేవారం కీర్తనలు నేర్చుకోవడంలో మునిగిపోయాడు. అక్కడినుండి ధర్మపురం ఆధీనానికి మరో రెండు సంవత్సరాల దీక్ష కోసం మారాడు. 20 వ శతాబ్దపు మహోన్నతమైన ఓదువార్లలో ఒకరైన ధర్మపురం పి స్వామినాథన్ వద్ద శిష్యరికం చేశాడు. ఆ గురువు ముద్ర అయిన భక్తిపాండిత్యాల సమ్మేళనాన్ని సారంగపాణి తన జీవితమంతా అనుసరించారు.

1975 లో ప్రఖ్యాతి గాంచిన తిరుత్తణి ఆలయంలో ఓదువార్ గా చేరి అక్కడ 26 సంవత్సరాలు తన అకుంఠిత గానవ్రతంతో ‘తిరుత్తణి ఓదువార్ స్వామినాథన్’ గా పేరు పొందారు. తేవారం, తిరువాచకాలను మలేసియా, దక్షిణాఫ్రికా, సింగపూర్, స్విట్జర్లాండ్, శ్రీలంక అక్కడి ప్రవాస భారతీయుల ఆహ్వానంపై తిరుప్పనాన్దాళ్, ధర్మపురం ఆధీనాల అధిపతులతో తరచూ కలిసివెళ్ళి వారికి నవరాత్రులు, తదితర పండుగలలో తేవారం పారాయణలను అందించారు.

### గురువుగా, ప్రచారకుడిగా, సంప్రదాయ ప్రతినిధిగా

ఆయన జీవనకార్యంలోని మునుపటి దశాబ్దాలలో గాన నిష్ఠ సాగితే, తదుపరి కాలంలో ఈ సంప్రదాయ ప్రసారం, ప్రచారం ఎక్కువగా కొనసాగిస్తున్నారు. తిరుత్తణి నుండి పదవీవిరమణ చేసిన తరువాత, స్వామినాథన్ చిదంబరంలోని వీఎస్ ట్రస్ట్ లో చేరి ఈనాడు స్వామిమలై, తిరునల్లార్, తిరువొత్రియుర్లలో ఓదువార్లుగా పనిచేస్తున్న విద్యార్థులను తీర్చిదిద్దారు. గత దశాబ్ద కాలంగా స్వామినాథన్ ధర్మపురం అధీనం పాఠశాలలో 30 మంది విద్యార్థులకు తేవారం, తిరుమురాయి కీర్తనలే కాకుండా, 63 మంది నాయనార్ల కథలు, పాడల్ పెట్ర స్థలాల ఇతిహాసాలు, దేవాలయారాధనలో ఓదువార్ కేంద్రంగా ఉన్న విధివిధానాల వెనుకనున్న తర్కాన్ని బోధిస్తున్నారు.

ఓదువార్ అనేది శివాలయాల్లో ‘అదనపు’ సాంస్కృతిక అలంకారం కాదని, అది శైవఆచారంలో అంతర్భాగ్యమని స్వామినాథన్ నేటి ప్రపంచానికి తెలియచెప్పారు. అనేక ఆగమ సంప్రదాయాలలో తిరుమురయి లేని పూజ అసంపూర్ణమైనదిగా పరిగణించబడుతుంది. ఐనా, తమిళనాడు అంతటా అనేక దేవాలయాలు శాశ్వత ఓదువర్లను తొలగించేశాయి. యువ ఔత్సాహికులు అల్పమైన జీతం, ఓదువార్ పోస్టులు ఎక్కడా లేకపోవడం, తాము పొందిన కఠినమైన శిక్షణస్థాయిని ఏ మాత్రం ప్రభుత్వం, సమాజం అంచనావేయలేకపోవడం వంటి సమస్యలతో పోరాడుతున్నారు.

### ఆయన ఉద్యమం కొనసాగుతుంది

స్వామినాథన్ తన 70వ వడి చివరలో ఉన్నారు. కానీ వారి జీవన కార్యక్రమంలో అదే క్రమశిక్షణ కొనసాగుతోంది. ‘నా స్వరం చెక్కుచెదరకుండా ఉన్నంతవరకు నేను పవిత్రమైన కీర్తనలు పాడుతూనే ఉంటాను. ఈ సేవలో యువకులకు శిక్షణనిస్తూనేఉంటాను.’ అని ఆయన చెబుతున్నారు. ఇప్పటికీ బోధించడం, వీలైనచోటల్లా తేవారం పారాయణకు హాజరుకావడం, ఇతరులు తేవారం పాడినప్పుడు ప్రేక్షకుల మధ్య నిశ్శబ్దంగా నిలబడి, ఒక కొత్త విద్యార్థి వలె వినడం – ఇలా తన కాలాన్ని గడుపుతున్నారు.

**-డా. వల్లూరి విజయ హనుమంతరావు, తాడేపల్లిగూడెం**

## మొలంగూర్ ఖిల్లా – స్వచ్ఛ జలాల 'పాల బావి'

కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ కు 13 కిలోమీటర్ల దూరంలో, శంకరపట్నం (కేశవపట్నం) మండలంలోని మొలంగూర్ గ్రామంలో చారిత్రక ప్రసిద్ధి కలిగిన మొలంగూర్ ఖిల్లా ఉంది. మొలంగూర్ పేరుతో కూడా దీన్ని పిలుస్తారు. ఈ కోట కాకతీయుల కాలానికి చెందిన మరో అజేయ దుర్గంగా ప్రసిద్ధి చెందింది. కాకతీయ రాజు ప్రతాపరుద్రుడి పాలనలో సుబేదారుగా ఉండే వొరగిరి మొగ్గరాజు ఈ కోటను నిర్మించినట్లు చారిత్రక ఆధారాలు చెబుతున్నాయి.

కాకతీయ సామ్రాజ్యంలోకి శత్రువులు చొరబడకుండా నిరోధించే పటిష్ట రక్షణ చర్యల్లో భాగంగా వ్యూహాత్మక స్థానంలో ఈ కోటను నిర్మించారు. ప్రాచీనకాలం నాటి నిర్మాణ నైపుణ్యంతో ఈ కోటను అద్భుతంగా నిర్మించారు. ఉత్తర తెలంగాణలోని ప్రముఖ చారిత్రక వారసత్వ కట్టడాల్లో ఈ మొలంగూర్ ఒకటి. కాకతీయ రాజులు నిర్మించిన నిర్మాణాలు, చెరువులు ఇప్పటికీ పర్యాటకులను ఆకర్షిస్తున్నాయి. రాజకుటుంబాలు నివసించిన భవనాల శిథిలాలు, రాణులు స్నానం చేసేవారని చెబుతున్న చెరువు, కోట చారిత్రక ఆధారాలుగా ప్రాధాన్యాన్ని సంతరించుకున్నాయి. పురావస్తు శాఖ రికార్డులు కూడా మొలంగూర్ కోట గొప్ప వారసత్వ, నిర్మాణ ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయి. కోట చుట్టూ ఎత్తైన, దట్టమైన చెట్లు ఉండటంతో సందర్శకులకు ఆహ్లాదకరమైన వాతావరణం గోచరిస్తుంది. ఈ కోట ప్రధాన ద్వారం శతాబ్దాల కాలాన్ని తట్టుకుని ఇప్పటికీ చెక్కుచెదరకుండా నిలిచి ఉంది.

ఈ ప్రాంతాన్ని సరైన మౌలిక వసతులతో అభివృద్ధి చేసి, రక్షిత చారిత్రక ప్రదేశంగా గుర్తిస్తే ప్రముఖ పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని చరిత్ర పరిశోధకులు భావిస్తున్నారు.

ఈ కోట పరిసరాల్లో దూద్ బౌలి, పురాతన శివాలయం, మలాంగ్ షా వలీ అనే సూఫీ ప్రచారకుడి సమాధి ఉన్నాయి. ఈ దూద్ బౌలి గురించి ప్రత్యేకంగా చెప్పుకోవాలి. కాకతీయుల కాలం నాటి మొలంగూర్ కోట ప్రాంగణంలోని చారిత్రక 'దూద్ బౌలి' (పాల బావి) ఒకప్పుడు నిజాం పాలకులతోపాటు చుట్టుపక్కల గ్రామాల దాహార్తిని తీర్చింది. గుట్ట కింద ఉన్న ఈ బావి నుంచి హైదరాబాద్ లో ఉన్న నిజాం కు గుర్రాలపై నీటిని తీసుకువెళ్ళేవారని చరిత్రకారుల అభిప్రాయం.

ఈ బావిలో ఉన్న పాలవంటి నీటికి గొప్ప ఔషధ విలువలుండి అనేక వ్యాధులను నయం చేశాయని ఇక్కడివారు చెప్తారు. చుట్టూ కొండలు.. వాటిపై వందల రకాల ఆయుర్వేద మొక్కలు, వృక్షాలు అశేషంగా ఉన్నాయి. ఈ మొక్కల సారం ఈ బావి నీటిలోకి చేరడమే నీటి ఔషధ గుణాలకు కారణమని చెప్తారు. అనారోగ్యానికి గురైన వారికి ఈ బావినీళ్లు తాగించడం స్థానికంగా వివిధ గ్రామాల్లో కనిపించే ఆచారం. ఈ బావిలోని నీరు సహజమైన నీటి రంగులో కాకుండా పాలవలె కొంచెం తెల్లగా ఉండటం దీని ప్రత్యేకత.




కాకతీయుల కాలంలోనే ఈ బావిని తవ్వించారని చరిత్ర చెబుతున్నది. ఈ బావి నీటికి ఉన్న మరో ప్రత్యేకత ఏమిటంటే ఈ నీటిలో ఫ్లోరైడ్ ఏ మాత్రం ఉండదు. ఎప్పుడూ స్వచ్ఛంగా కనపడుతుంది. అంతేకాకుండా మినరల్ వాటర్ కంటే ఈ నీళ్ళు తీయగా ఉంటాయని స్థానికులు చెబుతున్నారు. ఇటీవల నిర్వహించిన కొన్ని పరిశోధనల్లో భాగంగా దూద్ బౌలి నుంచి నీటి నమూనాలను సేకరించి పరీక్షించగా, ఈ నీటి స్వచ్ఛత పై ఉన్న వాదనలకు బలం చేకూరింది.

ఇప్పటికీ కరీంనగర్ ప్రాంతానికి వచ్చే పలువురు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు బ్రాండెడ్ మినరల్ వాటర్ కు బదులుగా ఈ బావి నీటిని తాగేందుకు ఆసక్తి చూపుతుంటారు. కొన్నేళ్ళ కిందటివరకూ ఈ బావి ఎప్పుడూ ఎండిపోయేది కాదని, అయితే సుమారు పదిహేను సంవత్సరాలుగా వేసవిలో నీరులేకుండా పోతున్నదని గ్రామస్తులు పేర్కొంటున్నారు. అయితే వర్షాకాలంలో మళ్ళీ నీటి ఊట రావడం మొదలవుతుందని చెబుతున్నారు. కొత్త జల రాగానే గ్రామస్థులు బావి వద్దకు చేరుకొని నీటిని తీసుకెళ్లేందుకు పోటీ పడుతుంటారు. బావిలోకి నీరు చేరడం ప్రారంభమైన సమయంలో దూద్ బౌలి వద్ద సందడి వాతావరణం నెలకొంటుంది.

దూద్ బౌలి నీటి నాణ్యతపై పరీక్షలు జరపాలని సంబంధిత అధికారులను ప్రభుత్వం గతంలో ఆదేశించింది. ఈ పరీక్షల ఫలితాలు ఆశ్చర్యకరంగా ఉన్నాయి. నీరు అత్యంత స్వచ్ఛంగా ఉన్నట్లు నిర్ధారణ అయ్యింది. అంతేకాకుండా, ఈ బావి నీటి నాణ్యత ప్రముఖ బ్రాండ్ల మినరల్ వాటర్ తో సమానంగా లేదా అధికంగా ఉన్నట్లు పరీక్షల్లో తేలడం విశేషం. కొన్ని కార్పరేట్ మినరల్ వాటర్ సంస్థలు కూడా ఈ నీటి నమూనాలను సేకరించి పరీక్షలు నిర్వహించాయని, పరీక్షల ఫలితాలు వారిని సైతం ఆశ్చర్యానికి గురిచేసాయని స్థానికులు చెబుతున్నారు.

అయితే చారిత్రక ప్రాధాన్యం, ప్రత్యేకమైన నీటి లక్షణాలతో ప్రసిద్ధి చెందిన దూద్ బౌలి ప్రస్తుతం నిర్లక్ష్యానికి గురవుతుండటం ఆందోళన కలిగిస్తోంది. చుట్టుపక్కల జరుగుతున్న గ్రానైట్ తవ్వకాల వల్ల కోట నిర్మాణాలు దెబ్బతినడంతో పాటు ఈ సహజ నీటి వనరుకు కూడా ముప్పు ఏర్పడుతోంది. చారిత్రక వారసత్వ సంపదగా గుర్తించి దూద్ బౌలిని పరిరక్షించడంతో పాటు మొలంగూర్ కోటను పర్యాటక కేంద్రంగా అభివృద్ధి చేయాలని స్థానికులు, చరిత్ర, ప్రకృతి ప్రేమికులు కోరుతున్నారు.

మొలంగూర్ ఖిల్లా వద్ద గ్రానైట్ తవ్వకాలకు అనుమతించడంపై గ్రామస్థులు పోరాటంచేసి ఆ ఉత్తర్వులను రద్దుచేయించారు. అదేవిధంగా ఈ ఖిల్లాను పర్యాటక కేంద్రంగా, దూద్ బౌలిని రక్షిత ప్రదేశంగా గుర్తించాలని, వీటి అభివృద్ధికి నిధులు ఇవ్వాలని కోరుతున్నారు. గ్రామస్తుల వినతులకు స్పందించిన కేంద్ర ప్రభుత్వం ఈ ప్రాంతానికి పురావస్తు, పర్యాటక శాఖల అధికారులను పంపింది. వారు ఖిల్లాను పరిశీలించి జాతీయ వారసత్వ సంపదగా గుర్తించారు.

**-శ్రీ భారత్, రాజమహేంద్రవరం**

ఈ నెలలో ఇతర ముఖ్యమైన రోజులు:

* గాంధీ, లాల్ బహదూర్ శాస్త్రి ల జన్మతిథి, అక్టోబర్ 2
* మహాలయా అమావాస్య, అక్టోబర్ 10
* విజయదశమి, అక్టోబర్ 20
* మహర్షి వాల్మీకి జయంతి, అక్టోబర్ 25
* సర్దార్ పటేల్ జన్మతిథి, జాతీయ ఐక్యతా దినోత్సవం, అక్టోబర్ 31